క్లుప్తంగా

చౌడేశ్వరీదేవికి కోట్ల హర్ష పూజలు



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు: పట్టణంలోని చౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకుని కుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌రెడ్డి, ఉపసర్పంచు మాదులు తదితరులు ఉన్నారు.

11 నుంచి మౌలాలి ఉరుసు

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని దిన్నెదేవరపాడు కొండపై వెలసిన హజరత్ మౌలాలి సాహెబ్ ఉరుసు ఉత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభమవుతాయని ముతవల్లి పి.మౌలాలి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 11న రాత్రి గంధం, 12న కిస్తీ, ఖవాలి, 13న జియారత్ ఉంటుందన్నారు.

కేసీ కెనాల్‌కు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. ప్రసుతం రిజర్వాయర్‌కు 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

అడుగేస్తే.. మురుగే..!



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామ ఎస్సీ కాలనీ వీధి రోడ్డులో అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి దాపురించింది. మురుగు నీరు రోడ్డుపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. రాకపోకల సాగించాలన్నా వీలుకాని పరిస్థితి. ముక్కు మూసుకొని రాకపోకలు సాగిస్తున్నామని, వ్యాధులు ప్రబలక ముందే పరిసరాలు శుభ్రం చేసి, సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పాణ్యం: పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ స్వచ్ఛ భారత్ కార్మికులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వీరికి మద్దతుగా సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు వేతనాలు మంజూరు చేయక పోవడం తగదన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ దస్తగిరి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డిలకు వినతి పత్రాలు అందించారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



ఎద్దుల బండలాగుడు పోటీ దృశ్యం

కోడుమూరురూరల్:పట్టణంలోని చౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకుని స్థానిక హైస్కూ ల్ మైదానంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి స్మారకార్థం శ్రీభూమాత రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న రాష్ట్ర స్థాయి ఎద్దులచే బండలాగుడు పోటీలను సోమవారం కేంద్ర మాజీ రైల్వే శాఖ సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ప్రా రంభించారు. బండలాగుడు పోటీల్లో వివిధ జి ల్లాల నుంచి 16 జతల ఎద్దులు పోటీపడ్డాయి.

నేడు ఎమ్మెల్యే రాక

గడివేముల: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి పాఠశాల ఆవరణలో మంగళవారం జరగనున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమావేశానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరవుతారని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో సమావేశంలో చర్చిస్తారన్నారు.

జగనన్నకు తోడుగా ఉందాం



రావూరి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని



హాజరైన గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు

- గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్ల శిక్షణలో ఎమ్మెల్యే కాటసాని
- టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు

కల్లూరు:వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కల్లూరు మండల పరిధిలోని గ్రామాల్లో ఎంపిక చేసిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రావూరి గార్డెన్‌లో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. వీటిని అర్హులకు అందిస్తూ పార్టీని బలోపేతం చేయడమే గృహ సారథులు, కన్వీనర్ల లక్ష్యమన్నారు.

టీడీపీ అసత్య ప్రచారాలను తిప్పికొడదాం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మేలు చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కాటసాని పిలుపునిచ్చారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోయినా సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌ది అన్నారు. రాష్ట్రంలో మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి కల్లూరు మండలం టీడీపీకి కంచుకోటగా ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధిక ఎంపీటీసీ స్థానాలతో పాటు మండల అధ్యక్ష స్థానాన్ని పార్టీ గెలుచుకుందన్నారు. మూడున్నరేళ్ల పాలనలో మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కె.నాగలాపురం నుంచి వయా బస్తిపాడు, చిన్నటేకూరు మిదుగా నన్నూరు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మించామన్నారు. సల్కాపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులతో పనులు చేపట్టామన్నారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి అనుగొండ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నంద్యాల జెడ్పీటీసీ గోకుల్ కృష్ణరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లావెంకట రమణారెడ్డి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు–2 చంద్రశేఖర్‌రెడ్డి, కర్నూలు నగర డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, మండల స్థాయి నాయకులు పెద్ద ఈశ్వరయ్య, సోమన్న యాదవ్, ఉలిందకొండ రమణారెడ్డి, కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

గూడూరు రూరల్: జగనన్న కాలనీలో లబ్ధిదారులు చేపట్టిన గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ జమ్మన్న సూచించారు. కె.నాగలాపురంలో లబ్ధిదారులు చేపట్టిన గృహ నిర్మానాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో 87 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలను చేపట్టారన్నారు. గృహాలకు అవసరమైన నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను పూర్తి చేశామన్నారు. లబ్ధిదారులకు సకాలంలో ఇసుక, సిమెంట్, స్టీల్ తదితర సామగ్రిని అందిస్తున్నామని, ఇప్పటికే కొందరు లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోగా మరి కొందరివి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మార్చి చివరిలోపు గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పంట నమోదు తప్పనిసరి

గూడూరు రూరల్: పంటల నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్ రెడ్డి సూచించారు. చనుగొండ్లలో సోమవారం ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటల వివరాల నమోదు చేపట్టినట్లు చెప్పారు. రైతులు తప్పనిసరిగా పంటల సాగు వివరాలు ఆర్‌బీకే సిబ్బందికి అందించి నమోదు చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటల నమోదు చేయించుకున్న వారికి పరిహారం అందుతుందన్నారు.

10 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎమ్) ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తలారి సుధాకర్ వెల్లడించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా యువతను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో 10 నుంచి 12 వ తేదీ వరకు మూడు రోజుల పాటు మొదటి సారి జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఓపెన్ కేటగిరీ మెన్స్ పోటీలకు సంబంధించి మొదటి బహుమతి, రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15, మూడో బహుమతి రూ.10, నాలుగో బహుమతి రూ.5 వేలు, ఓపెన్ కేటగిరి ఉమెన్స్ మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ. 5, మూడో బహుమతి రూ. 3, నాలుగో బహుమతి రూ. 2 వేలు, జూనియర్ బాలురు (70కేజీల లోపు, 18 సంవత్సరాల లోపు) మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.8, మూడో బహుమతి రూ.5వేలు, నాలుగో బహుమతి రూ. 3వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 9వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బీజేవైఎమ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలు ఏర్పాటు చేయాలి



నంద్యాల ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఆర్వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్ కోరారు. సోమవారం నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు పై చదువులకు ఇతర ప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే చదువులు ఆపేస్తున్నారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అయినా గడివేములలో ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్వీఎఫ్ జిల్లా కార్యదర్శి రియాజ్, మండల అధ్యక్షుడు రాము, పాణ్యం మండల నాయకులు బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



అవగాహ కల్పిస్తున్న ఏపీఎం వెంకటస్వామి

సి.బెళగల్: పొదుపు మహిళలు ప్రభుత్వ పథకాల ద్వారా జీవనోపాధులను మెరుగుపరుచుకోవాలని ఏపీఎం వెంకటస్వామి సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని కటిక వీధిలో పొదుపు మహిళలకు జీవనోపాధుల సృష్టి, ప్రభుత్వ సహకారాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలతో పెరటి కోళ్ల పెంపకం, పొట్టేళ్లు, పశు పోషణపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైకేపీ సీసీ నాగేంద్ర, వీఓఏలు, పొదుపు మహిళలు ఉన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్



విద్యార్థులతో కరస్పాండెంట్

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో సోమవారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. బెంగళూరుకు చెందిన మెడి అసిస్ట్ టిపివి కంపెనీ బీ ఫార్మసీ, ఫార్మా డి ప్రతినిధులు హాజరై 28 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ అభినందించారు.

షూటింగ్ బాల్‌లో సత్తాచాటాలి

కర్నూలు (టౌన్): ఈనెల 10 నుంచి 13 వరకు కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో నిర్వహించే స్త్రీ, పురుషుల 41 వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో షూటింగ్ బాల్‌లో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ క్రీడాకారులు అంకితభావంతో సాధన చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు, నరేష్, నాగరాజు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పీఎం సమృద్ధి యోజనపై అవగాహన

గూడూరు: పీఎం సమృద్ధి యోజన పథకంపై సోమవారం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. బ్యాంక్ ఆవరణంలో జరిగిన ఈ సదస్సులో మేనేజర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి పీఎం సమృద్ధి యోజన కింద రుణాలు ఇస్తామన్నారు. సక్రమంగా కంతులు చెల్లిస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలపైనా ఆయన మహిళలకు వివరించారు. మెప్మా టీఎంసీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

జీవనోపాధులు మెరుగుపరుచుకోవాలి

- డీఆర్‌డీఏ ఏపీఎం నాగరాజు



మాట్లాడుతున్న ఏపీఎం నాగరాజు

ఓర్వకల్లు: ప్రభుత్వ పథకాల ద్వారా జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ నాగరాజు సూచించారు. సోమవారం స్థానిక పొదుపు భవనంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళ ఏదో ఒక వ్యాపారం చేయడం వల్ల ఆర్థికంగా బలోపేతం చెందడమేగాక, స్థిరమైన జీవనోపాధికి దోహదపడుతోందన్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న సున్నా వడ్డీ పథకాల ద్వారా అందుతున్న ఆర్థిక వనరులను దుర్వినియోగం చేసుకోకుండా వ్యాపార రంగాలకు వినియోగించుకోవాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా పెట్టేళ్ల పెంపకం, పెరటి కోళ్లు, గొర్రెల పెంపకం, పాడి గేదెల వ్యాపారాలు పెట్టుకునేందుకు అవసరమైన నిధులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని, చిరు వ్యాపారాలు పెట్టుకొని ఇతర మండలాలకు ఆదర్శంగా నిలువాలని సూచించారు. కార్యక్రమంలో సమాఖ్య మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, స్థానిక ఏపీఎం వెంకటరామిరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన గ్రామాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు, సీసీలు, సీవీలు, బుక్‌కీపర్లు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పేదరికాన్ని పారదోలడమే లక్ష్యం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



ఉల్చాల గ్రామంలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): పేదరికాన్ని పారద్రోలడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏమైనా సమస్య ఉంటే చెప్పాలని కోరారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించి, సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. కులమతాలకు అతీతంగా, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. 98 శాతం అమలు అమలు చేసిన జననేతను మరోసారి ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ భాస్కర్ నాయుడు, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, ఏపీఓ మహమ్మద్ బాషా, ఏఈఓ మోహన్‌రెడ్డి, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ రామేశ్వరి పాల్గొన్నారు.

ఉల్చాలలో నేటితో ముగియనున్న 'గడప గడపకు'

కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో మంగళవారంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగియనుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ భాస్కర్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సూచించారు. సోమవారం మండలంలోని పోలకల్, సి.బెళగల్ గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో పేదల ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందుతున్న విషయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరాలన్నారు. పార్టీ కోసం పని చేసే నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అందరూ కలిసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలన్నారు. అనంతరం ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు రాబోయే కాలంలో చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు.

అసత్య ప్రచారాలపై ఆగ్రహం

తాను అనునిత్యం ప్రజలతో ఉంటూ, ప్రజా అవసరాలు, సమస్యలను దగ్గరుండి పరిష్కరిస్తూ ఆదరణ పొందుతుండటం చూసి తట్టుకోలేని పచ్చ మీడియా అసత్యాలను ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు కథనాలు, అసత్య ప్రచారాలను మానుకుని నియోజకవర్గంలో పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, జేసీఎస్ సీబీ తులసిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు చిన్న కొండన్న, గోపాల్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఎర్రన్న, రఘురెడ్డి, నాగరత్నం తదితరులు మాట్లాడారు. సమావేశంలో ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు వీరన్నగౌడ్, శోభారాణి, సర్పంచ్‌లు హనుమంతు, దస్తగిరి పాల్గొన్నారు.

నూతన ధర్మకర్త మండలికి దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని చెన్నకేశవ, ఆంజనేయ స్వాముల ఆలయాలకు నూతన ధర్మకర్త మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ కర్నూలు సహాయ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఏడుగురితో కూడిన మండలి నియామకానికి అర్హత ఉన్న అభ్యర్థులు తమ పూర్తి వివరాలను దరఖాస్తులో విధిగా పొందుపర్చాలని సూచించారు. ఆసక్తి ఉన్న సభ్యులు పూర్తి చేసిన దరఖాస్తును ఈ నెల 24వ తేదీలోగా సహాయ కమిషన్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మండల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు పొలాల గట్లు, భూ సమస్యలను, ఇళ్ల పట్టాలు, పింఛన్ పునరుద్ధరణ సమస్యపై అర్జీలు ఇచ్చారు. స్పందన అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ రాముడుతో కలిసి మండల, గ్రామ స్థాయి అధికారులతో పెండింగ్ సమస్యలు, స్పందన అర్జీలపై చర్చించారు. వీటినైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు.

ఆదాని వ్యాపారాలపై సీబీఐతో విచారణ జరపాలి

కల్లూరు: ఆదానీ అక్రమ వ్యాపాలపై సీబీఐతో విచారణ చేయించాలని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల చెక్‌పోస్టులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదిన్నర ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐలకు నష్టం చేకూరేలా వాటి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టిన ఆదానీ సంస్థపై ఆరోపణలు వచ్చినా పట్టించుకోకుండా, కొమ్ముకాయడం దారుణమన్నారు. సమావేశంలో నాయకులు బాలస్వామి, పఠాన్, వెంకట్‌నాయుడు, అభి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో మంత్రి ఆర్‌కె రోజా దంపతుల పూజలు



సుబ్రమణ్యేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మంత్రి ఆర్‌కె రోజా, భర్త సెల్వమణి

పాణ్యం: రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా దంపతులు పాణ్యం మండలం కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి సన్నిధిలో దాదాపుగా 4గంటల పాటు పూజలు చేశారు. ఆశ్లేష నక్షత్రం సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆర్‌కె రోజా, సెల్వమణిలకు ఆలయ ఈఓ రామక్రిష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారికి పాలాభిషేకం, రుద్రాభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు చేయించారు. అనంతరం ఆర్యవైశ్య అన్నసత్రంలో శృంగేరి పీఠం నుంచి ప్రత్యేకంగా అర్చకులు దాదాపు 4గంటల పాటు ఆశ్లేష నక్షత్ర పూజలు నిర్వహించారు. మంత్రి వెంట ఏపీ టూరిజం ఈఈ ఈశ్వరయ్య ఉన్నారు.



అశేష జనవాహిని మధ్య సాగుతున్న దేవి రథోత్సవం

రమణీయం.. రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ దేవి

కోడుమూరు రూరల్: పట్టణంలో వెలసిన చౌడేశ్వరీదేవి తిరునాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవక అశేషజనవాహిని మధ్య ఎంతో వైభవంగా సాగింది. అమ్మవారి రథానికి కోడుమూరు సీఐ శ్రీధర్, ఎస్‌ఐ విష్ణునారాయణ, శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, దైవచార ఆటకార సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేడుకలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.